# చూపుడు వేలు

-డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

"ఏమిటే శిరీషా! ఇల్లంతా ఏదో సువాసన గుబాళిస్తోంది?'' పేపరు తిర గేస్తున్న భారతమ్మ కళ్లద్దాలు తీసి మడిచిపెట్టి కోడల్ని అడిగింది.

"అదా అత్తయ్యా! దేవుడి ముందు వెలిగించిన అగరువత్తుల సువా సన'' అంది కాలేజీకి సమయానికి వెళ్లగలనా అనుకుంటూ హడావుడి పడుతున్న శిరీష.

"శేఖరం కూడా ఏదో రకరకాల ఊదువత్తులు తెస్తాడుగానీ ఇంత ఘుమఘుమలా డవు. వాటి పేరేమిటో చెప్పి భాస్కరాన్ని నాకో రెండు పేకెట్లు తెచ్చి పెట్టమను'' అనేసి కళ్లద్దాలు తగిలించుకుని పేపర్లో వార్తలు చూడ్డం మొదలుపెట్టింది భారతమ్మ.

"మల్లిగె అని బెంగుళూరునుంచి తెచ్చాన త్తయ్యా. ఇదిగో ఈ రెండు పెట్టెలు మీ సూట్‌కే సులో పడేయండి. మళ్లీ మరచిపోగలరు'' నవ్వు కుంటూ అత్తగారికి అందించింది శిరీష.

* * *

శేఖరం భారతమ్మ పెద్ద కొడుకు. మడకశిరలో స్కూల్ టీచరు. మొదటి నుండీ పెద్దవాడి దగ్గర ఉండి అలవాటయిన భారతమ్మకు అక్కడ ఇంటికి వచ్చిపోయేవాళ్లతో బాగా కాలక్షేపం అవుతుంది. చిన్నకొడుకు భాస్కర్ కర్నూలులో ఇంగ్లీషు లెక్చ రర్‌గా పనిచేస్తున్నాడు. ప్రైవేటు కాలేజీలో పని చేస్తుండడంవలన బదిలీల బెడదలేదు. పెద్దకో డలు పెద్దగా చదువుకోలేదు. ఇల్లు చక్కబెట్టుకోవ డమే ఆమె ఉద్యోగం. శిరీష కూడా మరో ప్రైవేటు కాలేజీలో పనిచేస్తోంది. ఇంటా బయటా నెగ్గుకురా వడానికి కాలంతో పోటీపడి పరుగులు తీస్తుం టుంది. ఇది కూడా ఒక కారణమే భారతమ్మ పెద్ద కొడుకు శేఖర్, కోడలు శ్రావణిల దగ్గర ఉండడానికి మొగ్గు చూపడానికి.

* * *

మర్నాడు సాయంత్రం భారతమ్మగారిని పలక రించి వెళ్లడానికి కర్నూలులోనే ఉన్న ఆవిడ దూరపు బంధువులు ఇద్దరు వచ్చారు. వచ్చిన వాళ్లిద్దరూ వయసు మళ్లినవాళ్ళు. కాస్త మడీ ఆచారం ఎక్కువ పాటించే వాళ్లు కావడంతో సోఫాల్లో కూర్చోవడానికి ఇష్టపడరని పెద్ద చాప తీసుకువచ్చి పరిచింది శిరీష.

చాపమీద నీలిరంగులో వున్న నెమళ్ల జంట ఎంతో అందంగా అగుపిస్తుంది. వచ్చినవారిని కుశ లప్రశ్నలు వేసి అతిధి సత్కారం చేసి లోపలకు జారుకుంది శిరీష.

బంధువుల గురించిన విశేషాలు, పెళ్లిళ్ల పేరం టాలు అన్నిటిగురించి పిచ్చాపాటీ కబుర్లయ్యాక వచ్చినవాళ్లు బయల్దేరుతూ భారతమ్మను నిష్ఠూరం చేసారు.

"ఇక్కడకు వచ్చినప్పుడయినా మా ఇళ్లకు రావొచ్చుకదా'' అని.

"కొడుకూ కోడలు ఇంటికొచ్చేసరికి ఎంతలే దన్నా అయిదున్నర అవుతుంది సాయంత్రం. అల సిపోయి వస్తారు పాపం. మళ్లీ నన్ను ఊళ్లోకి తీసు కువెళ్లండని తిప్పించడానికి మనసొప్పదు. ఇక్కడ నాకు కాలక్షేపం జరగడం కష్టం కనుకనే సంవత్సరా నికి ఒకసారి వచ్చి పదిరోజులు ఉండి వెడుతు న్నాను. ఈసారి వచ్చినప్పుడు ఎలాగో వీలు చూసుకుని మీ ఇంటికి వస్తాను'' అంటూ వాళ్లను శాంతపరిచింది భారతమ్మ.

వచ్చినవాళ్లు వెళ్లిపోయాక హాల్లో పరచిన చాపను చుట్టి పడకగదిలో పెట్టింది శిరీష.

"అమ్మాయీ! ఈ చాపలు ఎక్కడ దొరుకు తాయే? వాటిమీద అంత చక్కని బొమ్మలు వేయడం ఎక్కడా చూడలేదు నేను. అన్నిటిమీదా నెమలి బొమ్మలేనా? లేక ఇంకా వేరే బొమ్మలు కూడా ఉంటాయా?'' కోడల్ని ఆరా తీసింది భార తమ్మ.

అత్తగారి మనోగతం అర్థమయింది శిరీషకు.

"మీరు పట్టుకువెళతానంటే అలాంటి చాపలు రెండు తెప్పిస్తానత్తయ్యా మీ అబ్బాయితో చెప్పి. ఇంకా రకరకాల డిజైన్లు ఉంటాయిలెండి'' అంది శిరీష విసుగును కనబడనీయకుండా.

ఇంకోరోజు సాయంత్రం వాళ్ల వీధిలోకి బూజు కర్రలమ్మే అతను వచ్చాడు. అవి మామూలు ఈత పరకలు కట్టిన బూజు దులిపే కర్రలు కావు. పొడు గాటి ప్లాస్టిక్ స్టిక్‌కి చివర చీపురు ఆకారంలో (బ్రష్ లాగా) ప్లాస్టిక్ బ్రష్ ఉంది. ఒక్కోటి అరవై రూపా యలు చెప్పాడతను.

భారతమ్మ బేరమాడ్డం మొదలుపెట్టేసరికి నల భైకి దించాడు ధర.

ఇంట్లో బూజులు దులపడానికి పొడవుకర్ర, దేవుడి గదిలో మందిరం దులుపుకోవడానికి చిన్న దొకటి తీసుకుంది శిరీష.

"అట్లాగే నాక్కూడా రెండు తియ్యవే. ఆ చాపలో చుట్టి తీసుకువెళ్తాను. ఇలాంటి నాజూకు వస్తువులు అక్కడ దొరకవు. శ్రావణికి ఇటువంటి వాటిమీద సరదా ఎక్కువ'' అంది భారతమ్మ.

మారు మాట్లాడకుండా మరో రెండు కొంది శిరీష. ఈ ముసలావిడకు ఎంత ఆశో! మంచిది, కంటికి ఇంపుగా ఉన్నది ఏ వస్తువైనా సరే తనకు కావాలి.

పైకి శ్రావణి పేరు వాడినా అసలు సరదా పడేది అత్తగారే. తను ఉండేది వాళ్ల దగ్గర కనుక ప్రతి వస్తువూ అక్కడికి కొనుక్కువెళ్లాలని చూస్తుంది...అనుకుంటుంటే కాస్త చిరాకుగా అని పించింది శిరీషకు.

'కానీ ప్రతిసారీ ఉండే భాగోతమే' అనుకుంటూ లోపలకు తీసుకెళ్లింది కొన్నవాటిని.

"నాన్నమ్మ సరంజామా చాలానే చేరినట్టుందే అమ్మా! వెళ్లేలోపుగా ఇంకా ఏమేమి కావాలం టుందో. కొత్త వస్తువులు మనింట్లోకి ఏవి వచ్చాయో ఆవిడకు కనబడితే చాలు'' అంటూ నవ్వుతూ తల్లి చేతిలోని బూజుకర్రలు అందుకు న్నాడు శిరీష కొడుకు పవన్.

ఊళ్లోనేవున్న ఇంజనీరింగ్ కాలేజీలో చదువు తున్నాడు పవన్. నాన్నమ్మ అంటే చాలా ఇష్టం అతడికి.

కానీ ఈ వయసులో కూడా ఆవిడ ప్రతి కొత్త రకం వస్తువుమీద మోజుపడడం చూసి తమా షాగా ఆట పట్టిస్తూ ఉంటాడు.

తను వచ్చి పదిహేనురోజులు దాటడంతో ఇక వెళ్లిపోతానంటూ మొదలుపెట్టింది భారతమ్మ.

"ఆదివారందాకా ఆగమ్మా. బస్ ఎక్కిస్తాము'' అన్న భాస్కర్ మాటలు కొట్టి పడేసింది భార

తమ్మ.

"పవన్ బస్టాండుకు వచ్చి ఎక్కిస్తాడులే. అక్కడ అనంతపురంలో మా చెల్లెలి దగ్గర ఒక పూట ఉండి మడకశిర బస్సు ఎక్కుతా'' అంది భారతమ్మ.

'ఆ చాపచుట్టలూ, బూజుకర్రలూ ఎక్కించడం నావల్లకాదు' అన్నట్లు సైగలు చేస్తూ గదిలో వున్న పవన్ తల్లికి చేతులు జోడిస్తుంటే శిరీష నవ్వాపుకుని "ఎంతైనా మేమిద్దరం వచ్చి బస్ ఎక్కిస్తే మాకు తృప్తి అత్తయ్యా. ఇంకొక్క రెండు రోజులేగా ఉండిపొండి'' అంది.

"అలాగైతే ఆదోని నుండి పేలాలు, వడియాలు తెప్పిస్తానన్నావుగా. అవన్నా తెప్పించు ఆదివారంలోగా'' అంది భారతమ్మ.

'ఈవిడ ఆశపోతుతనం భరించడం కష్టం'' అని



మనసులోనే అనుకుంది శిరీష విసుగ్గా.

* * *

అత్తగారు ఊరికి వెళ్లిపోయాక అక్టోబర్‌లో దసరా సెలవుల్లో బెంగుళూరులో వున్న కూతుర్ని చూసి రావడానికి ప్రయాణమయింది శిరీష.

భాస్కర్, శిరీషల పెద్ద కూతురు వందిత, అల్లుడు భరద్వాజ్ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. వందితకు సెలవు దొరకడం కష్టం కనుక తనే దసరా సెలవులకో, వేసవి సెలవులకో కూతురి దగ్గరకు వెళ్లి వస్తుంటుంది శిరీష. ఆ పదిరోజులూ భాస్కర్, పవన్‌లే వండుకుని తింటారు. చట్నీపొడి, చింతకాయ పచ్చడి లాంటివి ముందే చేసి పెట్టి వెళ్తుంది శిరీష.

ఆదివారం ఉదయమే బెంగుళూరులో బస్సు దిగింది శిరీష. తల్లిని ఇంటికి తీసుకువెళ్లడానికి మెజిస్టిక్‌తో వచ్చింది వందిత.

"అబ్బా...ఇక్కడ అప్పుడే చలి మొదలయిందే" అంటూ కొంగు కప్పుకున్న తల్లిని చూసి నవ్వింది వందిత.

"కర్నూలు ఎండలకు అలవాటుపడి ఇక్కడ చలి అనిపిస్తోంది నీకు" అంది ఒక పద్ధతి, క్రమమూ లేకుండా పరుగులు తీస్తున్న ట్రాఫిక్‌లో జాగ్రత్తగా కారు నడుపుతూ. అమ్మమ్మ వచ్చిన సందర్భంలో రెండురోజులు స్కూలు ఎగ్గొట్టింది వందిత కూతురు నాలుగేళ్ల సిరి. అమ్మ వున్నన్ని రోజులు కాస్త వీలు చేసుకుని సాయంత్రం తొందరగా ఇల్లు చేరే ప్రయత్నం చేస్తోంది వందిత.

ఆరోజు తొందరగా ఇంటికి వచ్చిన కూతురికి వేడి వేడి పకోడీలు అందించిన శిరీష అంది "ఈ సోఫా బ్యాక్ కవర్స్ చాలా బాగున్నాయే. ఎప్పుడు కొన్నావు" అని.

"ఆమధ్యనెప్పుడో చిక్‌పేట వెడితే అక్కడో షాపులో కనబడ్డాయమ్మా. నీకు కావాలంటే తీసుకువస్తాను. పోనీ ఇవాళ వెళదామా?" అనడిగింది వందిత.

"భరత్ వచ్చేసరికి మనం వెనక్కి రాగలమా?" అనుమానపడింది శిరీష.

"ఫర్వాలేదులే అమ్మా. ఇంటి తాళం వుంది తన దగ్గర. టిఫిన్ కూడా చేసి పెట్టావు. పద" అంది వందిత.

"అలాగే ఆ డోర్ కర్టెన్‌లాగా వేసావే ప్లాస్టిక్ పూసలు పువ్వులతో అలాంటిది దొరికితే కొందాం" అంటూ శిరీష ఉత్సాహంగా షాపింగ్‌కు బయలుదేరింది.

* * *

శిరీష వచ్చి వారం గడిచింది. ఆదివారం రోజున పనిపిల్ల కార్పెట్ చుట్టిపెట్టి డోర్‌మాట్స్ దులిపి ఇల్లు ఊడుస్తోంది.

"అన్నట్లు ఆ డోర్ మ్యాట్స్ ఎక్కడ కొన్నావే వందితా. మెత్తగా చాలా బాగున్నాయి. కనీసం రెండేళ్లయినా వాడుకకు వస్తాయి" హాల్లో కూర్చుని ఇంగ్లీషు న్యూస్ వింటున్న శిరీష కూతుర్ని అడిగింది.

"అవి మా ఎదురింటావిడ సూరత్ నుంచి తెప్పించి అమ్ముతుందమ్మా. బాగున్నాయని తీసుకున్నాను. మళ్లీ తెప్పించిందేమో అడిగి వస్తానుండు" అంటూ ఎదురింటికి వెళ్లింది వందిత.

తిరిగి వస్తూ "నాలుగురంగుల్లో డోర్ మ్యాట్స్ తీసుకువచ్చింది. వాటిని చేతిలోకి తీసుకుని తడిమి చూసింది శిరీష "చాలా బాగున్నాయమ్మా" అంది తృప్తిగా. సోఫా బ్యాక్‌కవర్లు, డోర్‌కర్టెన్, డోర్ మ్యాట్స్ అన్నీ ఒక పెద్ద బ్యాగ్‌లో సర్దింది శిరీష.

"ఇంకో రెండురోజుల్లో కర్నూలు బయలుదేరాలి. అప్పుడే సెలవులు అయిపోవచ్చాయి" అంది బట్టలు తీసుకుని స్నానానికి వెళుతూ.

శిరీష అటు వెళ్లగానే ఇల్లు తుడుస్తున్న పనిపిల్ల నవ్వుతూ వందితతో అంది "ఇకమీదట మీరే వస్తువు కొన్నా అమ్మగారికి కూడా పట్టుకువస్తే సరిపోతుందమ్మా. అమ్మకు ఏది బాగుంటే అవి కావాలనిపిస్తాయి" అని.

"ష్...ఏమిటా మాటలు? అమ్మకు నచ్చితే ఏవైనా కొంటాను. దానిదేముంది" అంది వందిత పనిపిల్లను హెచ్చరిస్తూ.

బాత్రూమ్‌లోకి వెళ్తున్న శిరీష చెవుల్లో పనిపిల్ల అన్న మాటలు పడ్డాయి. వందిత జవాబు వినబడింది.

వెంటనే ఆమెకు అత్తగారు భారతమ్మ గుర్తుకువచ్చింది. ఆవిడకు అన్నిటి మీదా ఆశ ఎక్కువ అని తను విసుక్కోవడం గుర్తుకొచ్చింది.

'అంటే నేనూ ఆవిడలాగే ఇక్కడ అందంగా కనబడినవన్నీ కావాలంటున్నానా' అన్న ఆలోచన కొరడా దెబ్బలాగా చురుక్కున మెదిలింది. 'తను కోడలు కనుక అత్తగార్ని తప్పుబట్టింది. వందిత తన కూతురు కనుక ప్రేమగా అలా మాట్లాడింది'

'అత్తగారివైపు తన చూపుడువేలు చూపి తప్పు పట్టినప్పుడు మిగతా మూడువేళ్ళు తనవైపు తిరిగి ఉండడం తను మరచిపోయింది' అనుకున్న శిరీషకు తనలోకి తను చూసుకున్న నిశ్చింత కలిగింది.

★



## తేజోమయం

తెలుగులో రెండు మూడుచిత్రాలకే ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకునే స్థాయికి ఎదిగిన ఇలియానా ఇప్పుడు 'రాఖీ' చిత్రంలో నటిస్తోంది. ఈచిత్రం తర్వాత ఆమె తన పారితోషికాన్ని మరింత పెంచే అవకాశాలు కన్పిస్తున్నాయి. జూనియర్ ఎన్టీఆర్ హీరోకావడం, కృష్ణవంశీ వంటి అగ్రశ్రేణి దర్శకుడు నిర్మిస్తున్న ఈ చిత్రం అన్నాచెల్లెల అనుబంధానికి అద్దంపట్టే చిత్రం అంటున్నారు. ఈచిత్రంలో ఈమెతో పాటూ ఛార్మి కూడా నటిస్తుండడంతో తన అందాన్ని మరింత తేజోమయం చేసుకుంటోంది.

